క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీలు



ప్రైవేట్ బస్సును తనిఖీ చేస్తున్న ఎస్సై అప్పారావు

భామిని: మండలంలోని బత్తిలిలో ఎస్సై జి. అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒడిశా, తదితర ప్రాంతాల నుంచి వస్తున్న బస్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. మత్తు పదార్థాల రవాణ జరుగుతున్న నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేశామని ఎస్సై తెలిపారు.

210 మంది సీఆర్‌టీలకు రెన్యువల్

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో వివిధ ఆశ్రమపాఠశాలల్లో పనిచేస్తున్న 210 మంది కాంట్రాక్ట్ రెసిడెంట్ (సీఆర్‌టీ)టీచర్లను రెన్యువల్ చేసినట్లు ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర ఒక ప్రకటనలో తెలిపారు. విధుల్లో చేరిన వారంతా సక్రమంగా విధులు నిర్వహించాలని, విద్యాప్రమాణాల మెరుగుకు కృషి చేయాలని సూచించారు.

సన్మానం



సన్మాన గ్రహీతలతో విక్రంపురం సచివాలయ సిబ్బంది

కొమరాడ: మండలంలోని విక్రంపురం సచివాలయంలో పనిచేసి ఇటీవల బదిలీ అయిన సిబ్బందిని అదే సచివాలయంలో శుక్రవారం సన్మానించారు. సర్పంచ్ కళింగ శైలజ మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చారన్నారు. విధి నిర్వహణలో మనం చేసిన సేవలే గుర్తింపునిస్తాయని, పనిచేస్తున్న ప్రతిచోటా బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కె.మల్లేశ్వరరావు, ఎంపీటీసీ డి.వెంకటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు సిద్ధం



వర్మీకంపోస్టును పరిశీలిస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రంలో 300 కిలోల వర్మీకంపోస్టు సిద్ధంగా ఉన్నట్లు ఎంపీడీవో పి.త్రివిక్రమరావు తెలిపారు. శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించిన ఆయన..రక్షిత మంచినీటి పథకాన్ని, చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. పారిశుధ్యానికి ప్రాధాన్యమిస్తూ తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ పనులు చేపట్టాలన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు..



కాట్రగడ వద్ద ట్రాక్టర్‌తో దమ్ము

వర్షాలు పడుతుండడంతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పనుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు బిజీగా ఉన్నారు. బిల్లుమడ, బత్తిలి, తదితర గ్రామాల్లో ఉభాలు జోరుగా సాగుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ట్రాక్టర్లతో దమ్ము పనులు చేపడుతున్నారు.

– భామిని

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఎంపీడీఓ విజయ రంగారావు



కాలువల పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ విజయరంగారావు

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ విజయ రంగారావు అన్నారు. పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని లుంబూరు, గోపాలపురం, ఓని, గరుగుబిల్లి, తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. అక్కడి సచివాలయ, గ్రామీణ వైద్య సిబ్బందితో కలసి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో గ్రామాల్లో జరుగుతున్న కాలువల పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు. తాగునీటి వనరులు, చేతి బోర్ల తాజా స్థితిగతులపై ఆరా తీశారు.

కూటమి పాలన.. నయవంచన

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్ సీపీ నాయకులు

గుమ్మలక్ష్మీపురం:

కూటమి పాలన.. ఓ నయవంచన అని, ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మోసాలపై బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పేరిట వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టిందని వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ ఎం.రాధిక అన్నారు. శుక్రవారం మండలంలోని జర్న గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న సదరు నేతలు.. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు సర్కారు ప్రజలను మోసగిస్తున్న తీరు సహా గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను క్షుణ్ణంగా వివరించారు. అధికారమే పరమావధిగా అమలు సాధ్యం కాని హామీలిచ్చి, ఇప్పుడు వాటిని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రతిపక్ష నాయకులపై దాడులు, అక్రమ అరెస్టులు, కేసులతో ఎగబడుతున్నారని, ఇది రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రజలు ఎక్కడ డిమాండ్ చేస్తారోనన్న భయంతో డైవర్షన్ పాలిటిక్స్ తెరతీస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సమాంతరంగా జరిగిందని, ఇప్పుడు అవేవీ చేయకుండానే సుపరిపాలనకు ఏడాది పేరిట కార్యక్రమం నిర్వహించుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని, ఎన్నికల హామీలు నెరవేర్చేంత వరకు వైఎస్సార్ సీపీ ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు. ప్రజల్లో కూటమి పాలనపై తీవ్ర వ్యతిరేకత ఉందని, రాబోయే రోజుల్లో వారే కూటమికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ షేక్ నిషార్, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: జర్న గ్రామంలో కూటమి మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇచ్చిన పథకాల్లోనూ మోసమే..

జియ్యమ్మవలస రూరల్: బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని టీకే జమ్ము, పీటీ మండ, కొండచిలకాం గిరిజన గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడులు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారికి ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ఎన్నికల హామీలు అమలు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని వివరించారు. ఇప్పటి వరకు అమలు చేసిన ఒకట్రెండు పథకాల్లో ఏ విధంగా మోసం జరిగిందో తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఏడాదికి మూడు మాత్రమే ఇస్తున్నారని, చాలామందికి గ్యాస్ డబ్బులు కూడా పడలేదన్నారు. ఇటీవల ఇచ్చిన తల్లికి వందనం పథకంలో కూడా మోసమేనన్నారు. మొదట్లో ఈ పథకం కింద రూ.15 వేలు ఇస్తామన్నారని, ప్రస్తుతం రూ.13 వేలు ఇస్తున్నారని కొంతమందికి ఆ డబ్బులూ పడలేదన్నారు. చాలామందికి తల్లికి వందనం డబ్బులు రూ.10 వేలు, రూ.8 వేలు కూడా పడ్డాయన్నారు. మిగిలిన ఏ ఒక్క పథకం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రపంచ బ్యాంకు వద్ద తీసుకుంటున్న రూ.లక్షల కోట్లు అమరావతి అభివృద్ధి పేరిట కూటమి నాయకులకు దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలంతా కూటమి నయవంచన పాలన గమనిస్తున్నారని, కూటమిని ఎందుకు గెలిపించుకున్నామా అని మదనపడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గణేష్, మహిళ విభాగం అధ్యక్షురాలు ఉషా, మాజీ జెడ్పీటీసీ కె.బలరాం తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస రూరల్: గిరిజన గ్రామాల్లో ప్రభుత్వ మోసపూరిత పాలనను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అబద్ధాలు, మోసాలతో పాలన..

గరుగుబిల్లి: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అబద్ధాలు, మోసాలతోనే పాలన కొనసాగిస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తోటపల్లి, గిజబ గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఏడాది కాలంగా చంద్రబాబు సర్కారు ఎన్నికల హామీలు అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని వివరించారు. అలాగే గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను తెలిపారు. కార్యక్రమంలో ఆవాల కన్నయ్య, ఎం.వాసునాయుడు, అంబటి గౌరునాయుడు, తెర్లి ఎల్లంనాయుడు, గుంట్రెడ్డి చంద్రశేఖరరావు, మండల శంకరరావు, మరడాన అశోక్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: తోటపల్లిలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు

వర్షాలతో మొక్కజొన్నకు నష్టం

వీరఘట్టం: ఇటీవల కురిసిన వర్షాల వల్ల మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం కలిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షానికి మొక్కజొన్న కండెల పెరుగుదల నిలిచిపోయిందని, నీరు నిల్వ ఉండిపోవడంతో మొక్కలు కుళ్లిపోయాయని చెప్పారు. ఎకరాకు పది వేల కండెల దిగుబడి రావాల్సి ఉండగా.. కేవలం ఆరు వేల కండెల దిగుబడి మాత్రమే వచ్చిందని తెలిపారు. మండల వ్యాప్తంగా 300 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగులో సుమారు 200 ఎకరాల్లో పంట కోతకు వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి నష్ట పరిహారం మంజూరు చేయాలని కోరుతున్నారు.



మొక్కజొన్న పంటలో నిలిచిపోయిన నీరు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

పాలకొండ: నగర పంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నూతన కుళాయిల కనెక్షన్ల మంజూరు కోసం అజెండాలో పెట్టడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సంబంధిత వార్డు కౌన్సిలర్లతో చర్చించి అవకాశం ఉంటే మంజూరు చేయాలని తెలిపారు. 4, 5 వార్డుల పరిధిలో తాగునీటి సమస్యలున్నాయని కౌన్సిలర్లు కొరికాన గంగునాయుడు, వెలమల మన్మథరావు ప్రస్తావించారు. పైప్‌లైన్లు లేకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై కమిషనర్ రత్నంరాజు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో కనీసం బోర్లు వేసేందుకు కూడా అవకాశం లేదని తెలిపారు. వడమ కల్యాణి చెరువు గట్టుపై శివాలయం నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలని కోరారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రత్నంరాజు

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి

పాలకొండ రూరల్: ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యులు సుజయ్‌కుమార్, అంకిత అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ, క్షేత్రస్థాయి అనుబంధ రంగాలకు చెందిన వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో గ్రామీణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా వైద్య సేవలు పొందాలని సూచించారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యులు సుజయ్‌కుమార్, అంకిత

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్‌లు రద్దు

భామిని: ఎరువుల డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి విక్రయాలు చేపడితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని వ్యవసాయశాఖ పాలకొండ ఏడీఏ కె. రత్నకుమారి స్పష్టం చేశారు. మండల కేంద్రంలో మండల వ్యవసాయాధికారి కొల్లి తిలక్ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఇతర మండలాల రైతులకు ఎరువులు విక్రయించేటప్పుడు అక్కడి వ్యవసాయ సహాయకుడు ఇచ్చే స్లిప్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రోజుకు వంద బస్తాలకు మించి ఎరువులు విక్రయించరాదని చెప్పారు.



మాట్లాడుతున్న ఏడీఏ రత్నకుమారి, ఏఓ తిలక్

ఘనంగా శ్రావణమాస పూజలు



పాలకొండ: అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



వీరఘట్టం : కోటదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



బత్తిలి సంతోషిమాత సన్నిధిలో భక్తులు



వీరఘట్టం: భక్తులచే పూజలందుకుంటున్న కోటదుర్గ అమ్మవారు



పాలకొండ రూరల్: కదంబవన వాసినిగా జ్ఞాన సరస్వతీదేవి

పాలకొండ: పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. ప్రధానార్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో..

వీరఘట్టం: స్థానిక కోటదుర్గమ్మ ఆలయంలో శ్రావణమాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించారు. అలాగే పైడితల్లి, షిర్డీసాయి ఆలయాలతో పాటు వండవలోని షిర్డీసాయి ధ్యాన మందిర వద్ద సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.

బారులుదీరిన భక్తులు

భామిని: మండలంలోని బత్తిలి సంతోషిమాత ఆలయంలో భక్తులు బారులుదీరారు. అర్చకుడు రంపా తాతబాబు శర్మ ఆధ్వర్యంలో మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆంధ్ర, ఒడిశా ప్రాంత భక్తులతో ఆలయం కళకళలాడింది.

కదంబ వనవాసినిగా...

పాలకొండ రూరల్: నక్కలపేటలో కొలువైన జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని వేలాది కదంబ పుష్పాలతో అలంకరించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి భక్తులకు కదంబ వనవాసినిగా దర్శనమిచ్చారు. అర్చకుడు పత్రి శరత్‌కుమార్ శ్రావణమాస విశిష్టతను భక్తులకు వివరించారు.

మా పొట్ట కొట్టొద్దు..



మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, ఎండీఎం నిర్వాహకులు

భామిని: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం తయారీకి సామూహిక వంటశాల ఏర్పాటు చేసి ఎండీఎం కార్మికుల కడుపు కొట్టవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. మండల కేంద్రంలో పలువురు ఎండీఎం నిర్వాహకులతో కలసి ఆయన మాట్లాడుతూ.. సామూహిక వంటశాలల ఏర్పాటును వ్యతిరేకించాలన్నారు. ఆగస్టు 3వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరగనున్న ఎండీఎం నిర్వాహకుల జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు, కనీస వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎండీఎం నిర్వాహకుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మాలి పద్మ, అరిక గౌరమ్మ, ఉపాధ్యక్షురాలు ఎ.రాజేశ్వరి, నిర్వాహకులు కోరారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు



మాట్లాడుతున్న ఎస్‌డీపీఓ రాంబాబు

సీతంపేట: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి పోవద్దని పాలకొండ ఎస్‌డీపీఓ ఎం.రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ..సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపవద్దన్నారు. విద్యాప్రాధాన్యత, పోక్సో చట్టంపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై వై.అమ్మన్నరావు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఈఈగా నాగభూషణ్

సీతంపేట: గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా (డీఈఈ) నాగభూషణ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన సీతంపేట అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డీఈఈగా పనిచేసిన సింహాచలం గత నెలలో ఉద్యోగవిరమణ చేశారు. ఈ స్థానంలో నాగభూషణ్‌కు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వాహన తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని పూతికవలస జంక్షన్ వద్ద ఎల్విన్‌పేట సీఐ బి.హరి సిబ్బందితో కలిసి శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు.

మాదక ద్రవ్యాల రవాణా జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించడంతో పాటు వాహన ధ్రువపత్రాలు, వాహనదారుల లైసెన్స్‌లు తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



వాహనాలను పరిశీలిస్తున్న సీఐ హరి

జల కళ..

పాలకొండ రూరల్:

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో గడిచిన మూడు రోజులుగా పాలకొండ మండల వ్యాప్తంగా ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నాయి. దీంతో నదులు, వాగులు, గెడ్డలు, పంట కాలువల్లో జలకళ సంతరించుకుంది. నియోజకవర్గ పరిధిలో 35.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారిక లెక్కల సమాచారం. శుక్రవారం నాటికి మండల పరిధిలో అన్నవరం, గోపాలపురం, చిన్న, గొట్ట మంగళాపురం గ్రామాలతో పాటు యరకారాపురం, అంపిలి, తదితర గ్రామాల మీదుగా ప్రహిస్తున్న నాగావళి నదీ తీరంలో నీటి మట్టం పెరిగింది. దీంతోపాటు కోటిపల్లి, భాసూరు, రాజుపేట, గరుగుబిల్లి, ఎం.సింగుపురం, తదితర గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న రావాడగెడ్డ, ఓని గెడ్డ, తంపర వాడల్లో నీటి ప్రవాహం పెరగటంతో లోతట్టు పొలాల్లోకి నీరు చేరింది. దీంతో రాజుపేట సమీపంలో వెదలు జల్లిన, ఉడుపులు పూర్తి చేసిన పంట భూములు నీట మునిగాయి. పాలకొండ – వీరఘట్టం ప్రధాన రహదారిపైకి వర్షపు నీరు చేరడంతో వాహన చోదకులు అవస్థలు పడ్డారు. మరోవైపు ఉభాలకు సిద్ధ పడుతున్న రైతులకు తాజా వర్షాలు ఊరటనిస్తున్నాయి.



గోపాలపురం వద్ద నాగావళి నదిలో పెరిగిన నీటిమట్టం



భాసూరు రహదారిలో ఉధృతంగా ప్రవహిస్తున్న రావాడ గెడ్డ



రాజుపేట సమీపంలో నీట మునిగిన ఉడుపులు చేపట్టిన పంట భూములు



పాలకొండ - వీరఘట్టం ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు